# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-09-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విహంగా వీక్షణం చేపట్టారు.
- ❖ పౌర విమానయాన రంగానికి సాంకేతిక విప్లవాన్ని జోడించామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ బుడమేరు గండ్లు పూడ్చివేత పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు.
- ❖ వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి గణపతి పూజను ప్రోత్సహించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు.
- ❖ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉత్తర బంగాళాఖాతం మీదుగా కొనసాగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది.

==========================

విజయవాడ పరిసరాల్లోని వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విహంగా వీక్షణం చేపట్టారు. బుడమేరు డ్రైన్, కొల్లేరు ప్రాంతాలను ఈరోజు ఆయన పరిశీలించారు. బుడమేరు ప్రవాహాలు, ముంపు, గండ్లు పడిన ప్రాంతాల పరిశీలన చేపట్టారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా నది ప్రవాహాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు.

==========================

పౌర విమానయాన రంగానికి సాంకేతిక విప్లవాన్ని జోడించామని కేంద్ర పౌర విమాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. “డిజి యాత్ర” పేరిట విశాఖపట్నంతో సహా దేశంలోని 9 విమానాశ్రయాల్లో ప్రయాణీకులకు అవాంతరాలు లేని సరళ విధాన ప్రక్రియను ఈరోజు ఆయన విశాఖ విమానాశ్రయం నుంచి ప్రారంభించారు. ఈ

సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... దేశంలో ప్రస్తుతం 157 విమానాశ్రయాలు వున్నాయని.. వీటి సంఖ్యను రాబోయే 25 సంవత్సరాల్లో  400కు పెంచాలన్న లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం వనరులను అభివృద్ధి చేయబోతోందన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబుతో కలిసి రామ్మోహన్ నాయుడు “డిజి యాత్ర” కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశీయ విమాన రంగంలో భవిష్యత్ లో అనేక మార్పులకు శ్రీకారం చూడతామని కేంద్ర మంత్రి వెల్లడిస్తూ ...

(వాయిస్ 33 సెకన్లు)

===========================

బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుడమేరు 3వ గండి పూడ్చివేత పనులను పర్యవేక్షిస్తున్నారు. గత 4 రోజులుగా ఈ గండి ద్వారా 30 నుంచి 40 వేల క్యూసెక్కుల వరద నీరు విజయవాడలోని రాయనపాడు, అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాలను ముంచెత్తింది. నిన్న రాత్రికి 2 గండ్లను పూడ్చివేసిన జలవనరుల శాఖ.. 3వ గండి పూడ్చివేత పనులు ముమ్మరంగా కొనసాగిస్తోంది. బుడమేరు గండ్లు పూడ్చివేత పనులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు మంత్రి రామానాయుడు, అధికారులతో మాట్లాడి.. పనుల పురోగతిని తెలుసుకుంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే రేపు ఉదయానికి 3వ గండి పూడ్చివేత పనులు పూర్తి చేస్తామని మంత్రి రామానాయుడు తెలిపారు.

===========================

విజయవాడ నగరం అజిత్ సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లోకి మళ్లీ వరద చేరింది. నిన్నటి కంటే ఈరోజు మరో అడుగుకు పైగా వరద పెరిగింది. బుడమేరు ముంపు నుంచి తేరుకున్న సమయంలో మళ్లీ వరద రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామకృష్ణాపురం, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను వరద బాధితులకు అందిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా విజయవాడ నగరపాలక సంస్థతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు.

===========================

పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి గణపతి పూజను ప్రోత్సహించాలని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. మట్టిలో పరమాత్మను దర్శించే అద్భుతమైన తత్వదర్శనం, యోగదర్శనం పార్థివ గణపతి పూజలో ఉందని, వినాయక చవితికి గణపతిని మట్టితో తయారు చేయాలని పురాణాది శాస్త్రాలు సూచిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

===========================

గత 5 రోజులుగా సుమారు 10 లక్షల మంది వరద బాధితులకు ఆహారం అందించామని అక్షయపాత్ర ప్రతినిధులు వెల్లడించారు. దివీస్ ల్యాబ్, ప్రభుత్వ సహకారంతో రికార్డు స్థాయిలో బాధితులకు ఆహారాన్ని అందించామన్నారు. ప్రభుత్వం ఎప్పుడు, ఎంత అడిగినా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతోనే ఇంత పెద్ద సంఖ్యలో ఆహారాన్ని అందించగలిగామన్నారు. తాము ఎంత ఆహారం వండినా.. దానిని బాధితుల వద్దకు చేర్చడం గొప్ప విషయమన్నారు. అక్షయపాత్ర చరిత్రలో 10 లక్షల మందికి ఆహారం అందించడం ఇదే మొదటి సారి అని పేర్కొన్నారు.

విరామం

===========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి వెల్లడిస్తూ…

(వాయిస్ 36 సెకన్లు)

===========================

నేటి సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించడానికి ఆధ్యాత్మిక గ్రంధాలు దోహదపడతాయని దానిలో భాగంగానే ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి భగవద్గీత పారాయణం రేపటి నుంచి ప్రసారం అవుతుందని కార్యక్రమ విభాగాధిపతి బి. వేంకటేశ్వర్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటల 15 నిమిషాల నుంచి 7 గంటల 20 నిమిషాల వరకు 700 శ్లోకాలు, 700 రోజులు పాటు భగవద్గీత పారాయణం అవిశ్రాంతంగా ప్రసారం అవుతుందన్నారు. భగవద్గీత గానం, వ్యాఖ్యానం నిలయ విద్వాంసులు మల్లాది శ్రీరామ ప్రసాద్ అందిస్తారని, ఈ కార్యక్రమం ప్రసారణ అధికారి డాక్టర్ చుండూరు మాణిక్య రావు నిర్వహణలో ప్రసారం అవుతుందని తెలియజేశారు.

===========================

అలిపిరి మెట్లమార్గంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు త్వరలో దివ్యదర్శనం టోకెన్ల జారీని పునరుద్ధరించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు తెలిపారు. తిరుమలలో డయల్ యువర్ టీటీడీ ఈఓ కార్యక్రమంలో భక్తుల నుంచి పలు సలహాలు, సూచనలను ఈరోజు ఆయన స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ… అలిపిరి రాజగోపురం వద్ద టోకన్ల జారీ, గాలిగోపురం వద్ద టోకన్లు స్కానింగ్ కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే శ్రీవారిమెట్టు మార్గంలో దివ్యదర్శనం టోకన్లు జారీ చేస్తున్నామని… ఆధార్ ధృవీకరణకు కేంద్ర ప్రభుత్వం నుండి టిటిడికి ప్రాథమికంగా అనుమతి లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా త్వరలో పూర్తిస్థాయి అనుమతులు వచ్చాక… ఆధార్ ధృవీకరణతో పారదర్శకంగా భక్తులకు దర్శనం, గదులు కేటాయిస్తామన్నారు. గత మూడు నెలల్లో వారానికి లక్షా 5 వేల నుంచి లక్ష 63 వేల స్లాటెడ్ సర్వదర్శనం టోకన్ల పెంచామని, నిరీక్షించే సమయం తగ్గి, త్వరితగతిన సామాన్య భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారని టిటిడి ఈఓ తెలిపారు.

===========================

తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు జాతీయ రహదారిపై ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మరణించారు. దివాన్ చెరువు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని, దాని వెనుక నుండి వస్తున్న లారీ అదుపుతప్పి బలంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు.

===========================

తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో జలాశయానికి 32 వేల 347 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో 1,632 అడుగులకు గాను 101.77 టీఎంసీల నీటి నిల్వ ఉందని తెలిపారు. జలాశయం నుంచి వివిధ కాలువలకు, 12 గేట్లు ఎత్తి 32 వేల 047 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలియజేశారు.

===========================

===========================